క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో నివాసం ఉంటున్న దుక్కా ఆనంద్ ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. ఈ మేరకు వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జేసీఎస్ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ శనివారం ఆనంద్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆనంద్ తండ్రి దుక్కా దాసుకు దహన ఖర్చుల నిమిత్తం రూ 5. వేలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేళంగిణిరావు, చుక్కా శ్యామ్‌సుందర్, శౌరీ, రమేష్, కల్యాణ్ పాల్గొన్నారు.

సెమీస్‌కు ముంబయి, చెన్నై

ఉత్కంఠగా మేజర్ పోర్ట్స్ కబడ్డీ చాంపియన్‌షిప్

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా మేజర్ పోర్ట్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ ఏ పూల్‌లో ముంబయి పోర్టు, బీ పూల్‌లో చెన్నై పోర్టు జట్లు ఆధిక్యాన్ని ప్రదర్శించి సెమీస్‌కు చేరుకున్నాయి. సెమీస్‌లో ముంబయితో ట్యుటికోరిన్ పోర్టు జట్టు, చెన్నైతో జేఎన్‌పీ జట్టు తలపడనున్నాయి. పోర్టు స్టేడియంలో జరుగుతున్న పోటీల్లో శనివారం ఉదయం ట్యుటికోరిన్ జట్టు 61–39 పాయింట్లతో పారాదీప్ పోర్టు జట్టుపై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో కేవలం (28–21) ఏడు పాయింట్లే ఆధిక్యం సాధించిన ట్యుటికోరిన్ జట్టు.. తర్వాత పుంజుకుని విజయం సాధించింది. భరత్ 26, వేలన్ 14 పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో జేఎన్‌పీ జట్టు 31–19తో ఎన్‌ఎంపీ జట్టుపై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో రెట్టింపు(18–9)పాయింట్లతో జేఎన్‌పీ ఆధిక్యంలోకి దూసుకెళ్లగా.. పార్థీ 15, ప్రమోద్ 10 పాయింట్లతో విజయాన్ని ఖరారు చేశారు. సాయంత్రం జరిగిన తొలి మ్యాచ్‌లో ముంబయి పోర్టు జట్టు 36–16తో న్యూమంగళూర్ పోర్టు జట్టుపై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో 18–7లో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన ముంబయి తరఫున సౌరభ్‌రౌత్ 15, సౌరభ్ పార్తే 10 పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో చెన్నై పోర్టు జట్టు 64–32తో పారాదీప్ పోర్టుపై విజయం సాధించింది. చెన్నై పోర్టు తరఫున దినేష్ 12, హరికృష్ణ 11, స్టువర్ట్ 6 పాయింట్లు సాధించారు. స్పోర్ట్స్ కోటాలో పోర్టులో ఉద్యోగం సాధించిన వెటరన్ ఆటగాళ్లను ఈ సందర్భంగా నిర్వాహక కమిటీ సత్కరించింది.

ఘనంగా సైన్స్ ఎక్స్‌పో

సీతమ్మధార : విద్యార్థి దశ నుండే విజ్ఞాన శాస్త్రంలోని మెలకువలు తెలుసుకుని రాణిస్తే భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని పాఠశాల చైర్మన్ ఎం.ఎస్.మణి తెలిపారు. శనివారం ద్వారకానగర్ మొదటి లైన్‌లోని రవీంద్ర భారతి పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పో ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు రకాల పదార్థాలు, నమూనాలను అధ్యయనం చేయడం ద్వారా పరిజ్ఞానం పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, సుబ్బలక్ష్మీదేవి, ఎం.వెంకటేష్, పఠశాల ప్రిన్సిపాల్ పుష్పలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్చి 26 నుంచి సుదర్శన నారసింహ మహాయజ్ఞం

సింహాచలం : సింహగిరిపై మార్చి 26 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు చదుర్వేద హవనపూర్వక, పాంచాహ్నిక పంచకుండాత్మక శ్రీ సుదర్శన నారసింహ మహా యజ్ఞాన్ని నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి శనివారం తెలిపారు. దేశం శస్యశ్యామలంగా ఉండాలని, ప్రజలందరికీ శాంతి సౌభాగ్యాలు లభించాలని కాంక్షిస్తూ మహాయజ్ఞం నిర్వహించనున్నామన్నారు. మార్చి 26న అంకురార్పణతో ప్రారంభమయ్యే మహా యజ్ఞం ఏప్రిల్ 1న జరిగిన మహా పూర్ణాహుతితో ముగుస్తుందని తెలిపారు. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం 10.07 గంటలకు సింహగిరిపై ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో భూమిపూజ నిర్వహిస్తామని తెలిపారు.

ప్రణాళికతో పదిలం

- పదిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఎంజీఎం విద్యార్థులకు బోధన
- ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రిపరేషన్
- ఇంగ్లీష్ మీడియం నుంచి 56 మంది, తెలుగు మీడియం నుంచి 73 మంది హాజరు



విద్యార్థులతో చదివిస్తున్న ఉపాధ్యాయులు



ఎఫ్‌టీపీ ప్యానల్స్‌పై దృశ్య, శ్రవణ పద్ధతిలో బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

అల్లిపురం : పదవ తరగతిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు దృఢ సంకల్పంతో ఉన్నారు. మార్చి 18వ తేదీ నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే సిలబస్ పూర్తి చేశారు. ఇప్పుడు ఉపాధ్యాయులు విద్యార్థులచే రివిజన్ చేయిస్తున్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్‌కు అనుగుణంగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు ప్రాక్టీస్ చేయిస్తున్నారు. అదే విధంగా చేతి రాత కూడా పరీక్షల్లో ముఖ్యం కాబట్టి, విద్యార్థులు తమ చేతి రాతను మెరుగుపరుచుకునేందుకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠాలపై పూర్తి స్థాయి పట్టు సాధించేలా శిక్షణ అందిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. అంతిమంగా అత్యుత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఉత్తీర్ణతా శాతం పెంచేలా..

ప్రతి రోజు ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం వరకు రెగ్యులర్ తరగతులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం సుమారు 45 నిమిషాలు రోజుకి ఒక సబ్జెక్టుపై దృష్టి పెడుతున్నారు. రోజువారీ పరీక్షలు చేపడుతూ, విద్యార్థుల అనుమానాలు నివృత్తి చేస్తూ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

ఒత్తిడిని అధిగమించేలా..

పదవ తరగతి పరీక్షలు రాయడమంటే విద్యార్థుల్లో ఎంతో కొంత ఆందోళన, ఒత్తిడి ఉంటుంది. దాని నుంచి ఉపశమనం పొందేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్షల్లో విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాసే విధంగా ప్రతి రోజు ఉపాధ్యాయులు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. తల్లిదండ్రులతో మాట్లాడి ఇంటి వద్ద పిల్లలు ఒత్తిడికి గురి కాకుండా చూడాలని సూచిస్తున్నారు.

స్టడీ అవర్స్‌తో చాలా ప్రయోజనం..



ప్రతి రోజు స్కూల్లో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్ మాకు చాలా ఉపయోగపడుతున్నాయి. ఆ సమయంలో అంతా శ్రద్ధగా చదువుతున్నాం. మాకు వచ్చే సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాం. దీంతో పాఠ్యాంశాలపై పూర్తిగా అవగాహన ఏర్పడుతోంది. –దుర్గాప్రసాద్, విద్యార్థి

సైన్స్ సబ్జెక్టులపై శ్రద్ధ కనబరుస్తున్నాం..



ఫిజిక్స్ సబ్జెక్టుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. సిలబస్ పూర్తి చేశాం. విద్యార్థులతో రివిజన్ చేయిస్తున్నాం. వారికి డౌట్లు ఉంటే ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నాం. పిల్లలు కూడా శ్రద్ధగా చదువుతున్నారు. మంచి ఫలితాలు సాధిస్తామనే నమ్మకం ఉంది.

– బి.సునీత, ఫిజిక్స్ అసిస్టెంట్

ప్రణాళికతో చదువుతున్నాం



ఉపాధ్యాయులు చెప్పినట్లు పరీక్షలకు పక్కా ప్రణాళికతో చదువుతున్నాం. మంచి మార్కులు సాధిస్తామని మాపై మాకు నమ్మకం వచ్చింది. ఉపాధ్యాయులు చక్కని సూచనలు అందిస్తున్నారు. పదవ తరగతి పరీక్షలు చక్కగా రాయగలమనే ఆత్మస్థైర్యం మాలో కలుగుతోంది.

– మాధురి, విద్యార్థిని

ఉత్తమ ఫలితాలు సాధిస్తాం..



పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు అన్ని విధాలా సిద్ధం చేస్తున్నాం. ఉపాధ్యాయులంతా సమష్టిగా పని చేస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహించేలా పర్యవేక్షిస్తున్నాం. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ సాధించాలని సూచించాం. ఉత్తమ ఫలితాలు సాధిస్తాం. ప్రతి రోజు టెస్ట్‌లు నిర్వహిస్తున్నాం. వారం వారం పరీక్షలు నిర్వహిస్తున్నాం. సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం.

–ఆర్.వి.వి.ఎస్.నాగభూషణం, ప్రధానోపాధ్యాయులు, ఎంజీఎం హైస్కూల్

ఇంగ్లీష్‌పై పట్టు బాగుంది..



పదవ తరగతి విద్యార్థులు ఇంగ్లీష్‌పై పట్టు సాధించారు. గ్రామర్, ఎస్సై క్వశ్చన్స్‌పై బాగా ప్రిపేర్ చేయిస్తున్నాం. మరొక 20 రోజుల్లో పరీక్షలు ఉండటంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదివిస్తున్నాం. తల్లిదండ్రులకు కూడా పిల్లల చదువుకు సంబంధించి అవగాహన కల్పించాం.

– వర సునీత, ఇంగ్లీష్ అసిస్టెంట్

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ..



క్లాసులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. క్లాసులో బాగా చదివే పిల్లలతో వారికి శిక్షణ ఇప్పిస్తున్నాం. డీఈవోగారి ఆదేశాల మేరకు 40 రోజుల కార్యాచరణ పక్కాగా అమలు చేస్తున్నాం. ఉత్తమ ఫలితాల కోసం అందరం కృషి చేస్తున్నాం.

–బి.రాజేష్‌బాబు, మ్యాథ్స్ ఇన్‌చార్జి, ఎంజీఎం హైస్కూల్

ఘనంగా మన్యుసూక్త హోమం



శ్రీఆంజనేయ స్వామి దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మహారాణిపేట : మెయిన్‌రోడ్డులో వేంచేసిన శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం మన్యు సూక్త హోమం ఘనంగా జరిగింది. ప్రతి నెల పౌర్ణమి రోజున స్వామివారికి హోమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నిర్వహించిన హోమంలో దంపతులు పాల్గొన్నారు. నరఘోష, శత్రు ఘోష, రుణబాధ, గ్రహదోష శాంతి కోసం కార్య సిద్ధి హోమం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ హోమం నిర్వహించారు. రూ. 516 దేవస్థానం కౌంటర్‌లో చెల్లించి హోమంలో అనేక మంది దంపతులు పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేసినట్లు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం తెలిపారు.

వార్డు సమస్యలు సత్వరం పరిష్కరించాలి



మాట్లాడుతున్న జెడ్సీ ప్రసాదరావు

జగదాంబ : వార్డుల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు అన్నారు. శనివారం జీవీఎంసీ 29వ వార్డులో పర్యటించిన ఆయన జోనల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్‌లో సమస్యలు సమస్యలుగానే ఉండిపోతున్నాయన్నారు. దీని వలన ప్రజలకు సేవలు అందడం లేదన్నారు. ప్రతి రోజు జోన్ పరిధిలో పర్యటించినప్పుడు జెడ్సీతో పాటు జోనల్ స్థాయిలో హెచ్‌వోడీలు కూడా ఉండాలన్నారు. దీని వలన వార్డులోని సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. ఈ సమావేశంలో ఇంజినీరింగ్ ఈఈ సంతోషి, డీఈ సత్యనారాయణ, ఏఎంహెచ్‌వో రాజేష్, టౌన్‌ప్లానింగ్ అధికారి వినయ్‌కుమార్, మౌలిక సదుపాయలు, శానిటేషన్ సెక్రెటరిలు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపైనే భవన నిర్మాణ సామగ్రితో ఇక్కట్లు



దొండపర్తిలో రాకపోకలకు అడ్డంగా నిలిపివేసిన లారీ

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో భవన నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు మీదే ఇసుక, పిక్క వేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. దాంతో పాటు కాంక్రీట్ మిషన్ అడ్డంగా ఉండడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. ఈ ప్రాంతంలో తరచూ ఇదే పరిస్థితి తలెత్తుతున్నా జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చెత్త సేకరణపై అదనపు కమిషనర్ ఆరా



రామజోగయ్యపేటలో కాలువలు శుభ్రం చేయిస్తున్న అదనపు కమిషనర్ విశ్వనాథం

జగదాంబ : పారిశుధ్య కార్మికులు సరిగ్గా చెత్త సేకరిస్తున్నారా? అని జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథం ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శనివారం జోన్ పరిధి 29వ వార్డు రామజోగయ్యపేటలో ఆయన పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. అనంతరం క్లాప్ వాహనాలు వార్డుల్లో ఏ సమయంలో వస్తున్నాయని అడిగారు. ఇళ్లలో తప్పకుండా తడి–పొడి ప్రమాదకర చెత్త వేయడానికి మూడు రకాల డబ్బాలు ఉండాలన్నారు. అలాగే వీధుల్లో ఉన్న కాలువలు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలన్నారు. దీని వలన మాలేరియా, డెంగ్యూ వంటి ప్రమాదకర రోగాలు రాకుండా ఉంటాయన్నారు. రహదారులు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఏఎంహెచ్‌వో, శానిటరీ సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలన్నారు. శానిటరీ సెక్రటరీలు ఉదయం ఆరు గంటలకు వార్డుల్లోకి వచ్చి సిబ్బందితో పనులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు, ఏఎంహెచ్‌వో రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వయోశ్రీ యోజన పథకం

మహారాణిపేట : ప్రధాని మోదీ వయోవృద్ధులను వయోశ్రీలుగా నామకరణం చేసి 60 సంవత్సరాలు నిండిన పేద స్త్రీ, పురుషుల ఆరోగ్య అవసరాల నిమిత్తం ఈనెల 27 నుంచి మార్చి 5 వరకు గుర్తింపు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలన్నారు. రూ. 15 వేలలోపు ఆదాయం ఉన్న వారు ఈ పథకానికి అర్హులన్నారు.

తూర్పు నియోజక వర్గంలో ఈనెల 27న జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల గ్రౌండ్ (గాంధీ బొమ్మ ఎదురుగా)పెద్ద జాలరిపేటలో, దక్షిణ నియోజకవర్గంలో 28న వెలంపేటలో, 29న గాజువాకకు సంబంధించి కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్, రామాలయం సెంటర్ దగ్గర (గంగవరం), మార్చి 1న శృంగవరపుకోట గాయత్రీ విద్యా పరిషత్ మెడికల్ సెంటర్ (బొడ్డవర గ్రామంలో), 2న భీమిలి ఫుట్‌బాల్ గ్రౌండ్ (తగరపువలస)లో, 3న ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి డీఎల్‌బీ గ్రౌండ్‌లో, 4న పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి జిల్లా పరిషత్ స్కూల్ గ్రౌండ్ (గోపాలపట్నం)లో, 5న శృంగవరపుకోట శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ (మంగళపాలెం, కొత్తవలస)లో గుర్తింపు శిబిరాలు నిర్వహించనున్నట్లు రవికుమార్ తెలిపారు. ఈ శిబిరంలో గుర్తింపు పొందిన లబ్ధిదారులకు వారి అవసరాల నిమిత్తం కళ్లజోళ్లు, వినికిడి యంత్రాలు, కృత్రిమ దంతాలు, వీల్ చైర్లు, ఊత కర్రలు, చంక కర్రలు మొదలైన ఉపకరణాలు రాజ్య సభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు సహకారంతో ఉచితంగా అందచేస్తామని తెలిపారు.

అత్యధిక మెజార్టీతో జగనన్నను గెలిపించాలి



విద్యార్థులకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ప్రసాద్‌నాయుడు

దాబాగార్డెన్స్ : రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు విద్యార్థులు కృషి చేయాలని జ్యోతిబా పూలే బీసీ అసోసియేషన్ అధ్యక్షుడు పి. ప్రసాద్‌నాయుడు పిలుపునిచ్చారు. విద్యార్థుల ఉన్నతికి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ఉత్తరాంధ్ర జిల్లాలో గల పలు కళాశాలల వద్ద విద్యార్థులకు వివరించే కార్యక్రమానికి ప్రసాద్‌నాయుడు శనివారం శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా నగరంలోని పలు కళాశాలల విద్యార్థులతో ఆయన సమావేశం కావడమే కాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల కోసం అమలు చేసిన, చేస్తున్న సంక్షేమ ఫలాలు వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో విద్యార్థులందరూ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

రాఘవేంద్రరావు సేవలు ప్రశంసనీయం



రాఘవేంద్రరావును సత్కరిస్తున్న ప్రముఖులు

దాబాగార్డెన్స్: నాఫ్ కాబ్ డైరెక్టర్‌గా విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు ఎన్నిక కావడంతో విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ ప్రతిష్ట మరింత పెరిగిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో అభినందన సభను బ్యాంక్ డైరెక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాఘవేంద్రరావు సారథ్యంలో బ్యాంకులో పలు నూతన సాంకేతిక సేవలు ప్రవేశపెట్టి సభ్యులు, ఖాతాదారులకు అందుబాటులోకి తీసుకువచ్చారని చెప్పారు. సహకార స్ఫూర్తితో బ్యాంకును పురోభివృద్ధి దిశలో నడిపిస్తున్న చలసాని 20 ఏళ్లగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సహకార అర్బన్ బ్యాంకులు, క్రెడిట్ సొసైటీలు బలోపేతానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ తనకు జరిగిన సత్కారం అర్బన్ బ్యాంకులు, క్రెడిట్ సొసైటీల జాతీయ సమాఖ్యకు చెందుతుందన్నారు. సహకార వ్యవస్థ చాలా సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాయని, సహకార వ్యవస్థ మనుగడకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్యాంక్ గౌరవ విశ్రాంత చైర్మన్ మానం ఆంజనేయులు, డైరెక్టర్లు గుడివాడ భాస్కరరావు, సూర్యనేని నాగభూషణ చౌదరీ, అప్పారి జోసెఫ్ స్టాలిన్, నామన కామరాజు, కాకి భవాని, గుళ్లపల్లి జనార్దనరావు, చెరువు ఆదినారాయణ, శిరివూరి జానకి రామచంద్రరాజు, కండాపు ప్రసాదరావు, ఉప్పలపాటి పార్వతీదేవి, జేవీ సత్యనారాయణమూర్తి, దండమూరి బాబూరావు, ఎ.రామకృష్ణారావు, కృష్ణమోహన్, బ్యాంక్ సీఈవో పీవీ నరసింహమూర్తి, డిప్యూటీ సీఈవో వరలక్ష్మి, జనరల్ మేనేజర్ ఏవీ రామకృష్ణారావు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



రమా సహిత సత్యనారాయణస్వామి

దాబాగార్డెన్స్ : ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి ప్రత్యేక పూజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. మాఘ పౌర్ణమి కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి దర్శనానికి బారులు తీరారు. అనేక మంది భక్తులు ముందుగా సముద్ర స్నానమాచరించి సత్యదేవుడి ఆలయానికి వచ్చారు. నగరం నుంచే కాక జిల్లా నలుమూలలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. వేకువజాము 4 గంటల నుంచే స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపారాధన చేశారు. ఆలయం చుట్టూ గోవింద నామాలు స్మరిస్తూ ప్రదక్షిణలు చేశారు. ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక టిక్కెట్ ద్వారా స్వామి దర్శనం కల్పించారు.

ధ్వజస్తంభ పూజ.. సామూహిక వ్రతాలు..

వేకువజాము 4 గంటలకు ధ్వజస్తంభ పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. అనివెట్టి మండపంలో కూడా ప్రత్యేక వ్రతాలు జరిపారు.

విస్తృత ఏర్పాట్లు..

భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా భద్రతా చర్యల కోసం అధిక సంఖ్యలో పోలీసులను నియమించారు. ఎక్కడికక్కడ షామియానాలు వేసి, మంచినీటి సదుపాయం ఏర్పాటు చేశారు. ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ ఈవో బుద్ధ మహలక్ష్మి గణేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా లలితాదేవి నగరోత్సవం



ప్రత్యేక అలంకరణలో లలితాదేవి పల్లకీ ఊరేగింపు



గుర్రపు రథంపై ఊరేగుతున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితా పీఠం 75వ వార్షికోత్సవాల్లో భాగంగా ఐదు రోజుల పాటు నిర్వహించిన అమ్మ తోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం లలితాదేవిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగించారు. మేళతాళాలు, కోలాటం, తప్పిట గుళ్లు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య నగర వీధుల్లో ఊరేగింపు కనుల పండువగా సాగింది. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠం వద్ద ప్రారంభమైన నగరోత్సవం శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ మీదుగా తిరిగి పీఠానికి చేరుకుంది. ఈ ఉత్సవంలో గుర్రపు రథంపై పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, ఓపెన్ కారుపై శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని పాల్గొన్నారు. ఉదయం పీఠంలో స్వామీజీ చేతుల మీదుగా కుంభాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కుర్తాళం పురోహితుడు మాచవోలు రమేష్‌శర్మ, లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి 9 కేంద్రాల్లో టెట్

విశాఖ విద్య: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్–2024) ఈ నెల 27 నుంచి మార్చి 6 వరకు జరగనున్నట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 37,556 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. వీరి కోసం జిల్లాలో 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు ఒరిజినల్, జెరాక్స్ ప్రతి, ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకొని రావాలన్నారు. డీఈవో కార్యాలయంలో టెట్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఇతర సమాచారం కోసం 9849245230, 6305538679 నంబర్లలో సంప్రదించాలన్నారు.

27న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల గ్రీవెన్స్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల్లోని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల కోసం ఈ నెల 27న గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ బి.సుజాత తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరు సీతారామరాజు జిల్లా, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది జీత భత్యాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు ఆ రోజు ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తామని ప్రాంతీయ సంచాలకురాలు వెల్లడించారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం

ఎంవీపీ కాలనీ: స్థానిక శ్రీసాయి గోకుల గురుదత్త విహార్‌లో భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం శ్రీరుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీ సెక్టార్–11లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 25 వరకు ఈ వేడుకలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.